పెరిగిన డివిజన్లు



జీహెచ్ఎంసీ సర్కిల్-6 కార్యాలయం

ముషీరాబాద్‌లో 3.. అంబర్‌పేటలో 3

రాంనగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మున్సిపల్ డివిజన్ల డీలిమిటేషన్‌లో భాగంగా ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో అదనంగా మూడు చొప్పున పెరిగాయి. ప్రస్తుతం ముషీరాబాద్‌లో ఆరు డివిజన్లు ఉండగా 9కు పెరిగాయి. అంబర్‌పేటలో 5 డివిజన్లు ఉండగా 8కు పెరిగాయి.

ఆశావహుల్లో ఆనందం

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో ప్రస్తుతం ఉన్న డివిజన్ల కంటే ఒక్కో నియోజకవర్గంలో అదనంగా మూడు డివిజన్లు పెరగడంతో కార్పొరేటర్ టికెట్ ఆశిస్తున్న అభ్యర్థుల్లో ఆనందోత్సవాలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం ఏర్పడ్డ డివిజన్లలో 30వేల మంది ఓటర్లు ఉండటం, పరిధి తగ్గించడం పోటీ చేసేందుకు ఎక్కువమంది పోటీ పడే అవకాశాలు ఉన్నాయి. పాత డివిజన్లతో పోల్చితే అన్నీ రెండు డివిజన్లుగా మారాయి.

ముషీరాబాద్‌లో మొత్తం డివిజన్లు

అడిక్‌మెట్(163), బాగ్‌లింగంపల్లి(164), గాంధీనగర్(165), కవాడిగూడ(166), బాకారం(167), భోలక్‌పూర్(168), ముషీరాబాద్(169), రాంనగర్(170), బాపూజీనగర్(171).

అంబర్‌పేటలో..

కాచిగూడ(155), తులసీరాంనగర్(156), గోల్నాక(157), పటేల్‌నగర్(158), అంబర్‌పేట(159), డీడీ కాలనీ(160), తిలక్‌నగర్(161), నల్లకుంట(162).

కవాడిగూడ, గాంధీనగర్‌లో మార్పులేదు

ముషీరాబాద్ నియోజకవర్గంలోని కవాడిగూడ, గాంధీనగర్ డివిజన్లలో పెద్దగా మార్పులు చేయలేదు. ముషీరాబాద్ డివిజన్ మూడు ముక్కలుగా చేసి బాపూజీనగర్, బాకారం, ముషీరాబాద్ డివిజన్లుగా విభజించారు. పాత రాంనగర్ డివిజన్‌ను రెండుగా విభజించి రాంనగర్, బాగ్‌లింగంపల్లి డివిజన్లుగా మార్పు చేశారు. అడిక్‌మెట్ డివిజన్‌ను కొద్దిగా తగ్గించి మార్పులు, చేర్పులు చేశారు. అన్ని డివిజన్ల కంటే రాంనగర్ డివిజన్ చిన్న డివిజన్‌గా మారింది. ఈ డివిజన్లు అన్నీ ప్రధాన రోడ్లను పరిగణనలోకి తీసుకుని భౌగోళికంగా విభజించారు.


అంబేద్కర్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కె.రవిచారి తదితరులు

అంబేద్కర్ నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

రాంనగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ కె. రవిచారి హామీ ఇచ్చారు. జలమండలి మేనేజర్ శివసాయితో కలిసి బస్తీలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీ సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేటర్ బడ్జెట్‌లో రూ. 30 లక్షలతో అంబేద్కర్‌నగర్‌లో డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


విద్యార్థులతో యూత్ పార్లమెంట్ నిర్వహించిన డిప్యూటీ డీఈవో శ్రావణ్‌కుమార్, ఐఓఎస్ స్వరూపరాణి తదితరులు

విద్యార్థులపైనే దేశ భవిష్యత్

● డిప్యూటీ డీఈవో శ్రావణ్‌కుమార్

ముషీరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ డీఈవో శ్రావణ్ కుమార్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో 42 మంది విద్యార్థులను ఎంపిక చేసి పార్లమెంట్, అసెంబ్లీ, యూఎన్ కమిటీలుగా విభజించి యూత్ పార్లమెంట్ నిర్వహించామని తెలిపారు. ముషీరాబాద్ విద్యామండలి ఐఓఎస్ స్వరూపరాణి, జయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మహారాణి నాటిక ప్రదర్శన

చిక్కడపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రంగస్థల, సినీ, టీవీ నటి, రచయిత్రి, దర్శకురాలు శ్రీజ సాధినేని దర్శకత్వంలో త్యాగరాయగానసభలో ప్రదర్శించిన మహారాణి నాటిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ నాటికలో ప్రధానమైన రాణి పద్మినీదేవి పాత్రను శ్రీజ సాధినేని పోషించి రక్తికట్టించారు. నాటికలో అందరూ మహిళలే కావడం విశేషం. ప్రస్తుతం రీల్స్, డ్యాన్స్ అంటూ వెర్రివేషాలు వేస్తున్న వారిపై విమర్శనాత్మకమైన ఆలోచనను రేకెత్తిస్తూ సందేశాన్ని ఇస్తూ ప్రదర్శించిన నాటికలో శ్రీజతోపాటు శ్రీలక్ష్మి, ఇందు, సరస్వతి, సుందరీనాగమణి, సంధ్యారెడ్డి, సర్వమంగళగౌరి, రేణుక, సహస్ర తదితరులు నటించారు. కార్యక్రమంలో నాటక రచయిత అత్తలూరి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రంజింపజేసిన 'శ్రీకృష్ణరాయబారం'

చిక్కడపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నెల్లుట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రదర్శించిన శ్రీకృష్ణరాయబారం పౌరాణిక పద్యనాటక ప్రదర్శన ప్రేక్షకులను రంజింపజేసింది. నెల్లుట్ల రవీందర్‌రావు(జనగామ) పర్యవేక్షణలో నిర్వహించిన నాటక ప్రదర్శనలో ఆంజనేయశర్మ, రాజు, నాగరాజుశర్మ, వైకుంఠం, సాంబమూర్తి తదితరులు పలు పాత్రలు పోషించి రాగాలాపనతో శ్రోతలను ఆకట్టుకున్నారు.


అభివాదం చేస్తున్న విద్యార్థి సంఘం నేతలు నాగరాజు, పృథ్వీ, నితీష్ తదితరులు

విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించండి

రాంనగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎన్నికలు నిర్వహించాలని పలు విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రజనీకాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు, ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణ్, పీడీఎస్‌యూ అధ్యక్షుడు పృథ్వీ, ఏఐడీఎస్‌వో ఉపాధ్యక్షుడు నితీష్, పీడీఎస్‌యూ కార్యదర్శి ఎ.సాంబ, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వరరావు, పీడీఎస్‌యూ విజృంభణ ఉపాధ్యక్షుడు పవన్, తెలంగాణ యువజన సంఘం నాయకుడు శశాంకర్, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు పాల్గొని మాట్లాడారు. రెండు దశాబ్దాలుగా విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.కిరణ్, అశోక్‌రెడ్డి, లెనిన్, రమేష్, నాగేందర్, కైలేష్ తదితరులు పాల్గొన్నారు.

'జీవో 429 అమలు చేయాలి'

రాంనగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు సంబంధించిన జీవో 429ను అమలు చేయాలని ఆర్ఎంపీ, పీఎంపీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నేతి రాజేశ్వర్ కోరారు. మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అశోక్‌రాజ్, నాయకులు కట్ట శ్రీనివాసరాజు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ శ్మశానవాటికలో పవిత్ర అంత్యక్రియలు

ముషీరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బాపూజీనగర్‌లో దారుణ హత్యకు గురైన పవిత్ర అంత్యక్రియలు మంగళవారం ముషీరాబాద్ శ్మశానవాటికలో జరిగాయి. బంధుమిత్రులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పవిత్ర తల్లిదండ్రుల రోదనలు అందరినీ కంటతడిపెట్టించాయి. నిన్న, మొన్నటి వరకు అందరితో కలిసి తిరిగిన పవిత్ర లేదని తెలిసి స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించండి

కార్మికులకు ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి పిలుపు


కేక్‌కట్ చేసి మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి. సంజీవరెడ్డి

రాంనగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికవర్గం ఉద్యమించాలని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆజామాబాద్‌లో వీఎస్టీ ఫంక్షన్ హాల్‌లో వీఎస్టీ కన్స్యూమర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన స్వర్ణోత్సవ కేక్ కట్‌చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీఎస్టీ కన్స్యూమర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి కావడం అభినందనీయమన్నారు. కార్మికుల హక్కుల రక్షణ, భద్రత కోసం ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా తనను గెలిపించిన కార్మికులకు రుణపడి ఉంటానని, వారికి ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్, వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎల్.డి.పాల్, సలహాదారులు కె.రాజు, ఉప ప్రధాన కార్యదర్శి ఏ.ఆర్.శ్రీనివాస్, ముఖ్య ఉపాధ్యక్షుడు జి.నాగేష్, కన్స్యూమర్ సొసైటీ చైర్మన్ ఎం.డి.హబీబ్‌షరీఫ్, ప్రధాన కార్యదర్శి టి.పాల్‌సింగ్, కోశాధికారి ఎస్.గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.



పట్టాలు అందుకున్న బీపీటీ, ఎంపీటీ విద్యార్థులు

దేశ, విదేశాల్లో ఫిజియోథెరపిస్టులకు ఆదరణ

నల్లకుంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశ, విదేశాల్లో ఫిజియోథెరపిస్టులకు ఆదరణ ఉందని నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మాజీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ శాంతాసిన్హా పేర్కొన్నారు. మంగళవారం విద్యానగర్ డీడీఎంఎస్ ఆవరణలో గల దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీ(డీడీసీవోపీ) 22వ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాంతాసిన్హా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ స్థాయికి ఎదిగామనే విషయం విద్యార్థులు విస్మరించరాదన్నారు. కన్నవారి కలలను నిజం చేయాలని ఫిజియోథెరపీ విద్యార్థులకు సూచించారు. డీడీఎంఎస్ అధ్యక్షురాలు ఉషాకంద, డీడీసీవోపీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రావంతి పెరకం మాట్లాడుతూ దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆశయ సాధన దిశగా తాము పనిచేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ(బీపీటీ) పూర్తి చేసిన 43 మంది విద్యార్థులు, మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ(ఎంపీటీ) పూర్తి చేసిన 9 మంది విద్యార్థులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో డీడీఎంఎస్ ట్రస్ట్ సభ్యులు, డీడీసీవోపీ చైర్మన్ ఐవైఆర్.కృష్ణారావు, ఉపాధ్యక్షురాలు కె.లక్ష్మీసుందరి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం గ్రేటర్ అధ్యక్షుడిగా అభిలాష్‌గౌడ్


అభిలాష్‌గౌడ్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ సంఘం గ్రేటర్ అధ్యక్షుడిగా మేడల అభిలాష్‌గౌడ్ నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ఆయనకు మంగళవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అభిలాష్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైలులో చోరీపై జీరో ఎఫ్ఐఆర్

బర్కత్‌పుర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైలులో బంగారు ఆభరణాల చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర జల్గాన్ ప్రాంతానికి చెందిన మాంగ్‌సే అన్విత్ పాటిల్(30) జల్గాన్ నుంచి కాచిగూడకు రైలులో వస్తున్నాడు. ముత్కేడ్ రైల్వే స్టేషన్ వద్ద చూసుకోగా పర్సు కనిపించలేదు. పర్సులో మూడు గ్రాముల పుస్తెలు, 1.10 గ్రాముల సిల్వర్ చైన్, రూ. 7 వేల నగదు ఉంది. బాధితుడు కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం కేసును నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేశామని సీఐ ఎల్లప్ప తెలిపారు.

పూజా సామగ్రికి పాలిష్ చేస్తామని..

నాలుగు తులాల బంగారు గాజులతో పరారీ

ముషీరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పూజా సామగ్రికి పాలిష్ చేస్తామని ఇద్దరు వ్యక్తులు వృద్ధురాలిని నమ్మించి నాలుగు తులాల బంగారు గాజులు తీసుకొని ఉడాయించిన సంఘటన ముషీరాబాద్‌లో జరిగింది. అమర్‌ఖానా ఎదుటి వీధిలో వృద్ధురాలు అంజనీబాయి కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తోంది. సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు ఆమె ఇంటికి వెళ్లి తలుపు కొట్టారు. అంజనీబాయి తలుపులు తీయగా.. పూజా సామగ్రికి పాలిష్ చేస్తామని ఆమెను నమ్మించి ఇంట్లోకి వెళ్లారు. ఆమె కుమారుడు రమేష్ దివ్యాంగుడు. ఇంట్లోకి ఎందుకు వచ్చారు.. బయటే ఉండమని చెప్పాడు. ఉచితంగా పూజా సామగ్రికి పాలిష్ చేస్తామని చెప్పారు. రమేష్ చేతిలో తెల్లటి పౌడర్, పసుపు పెట్టగా అతడి శరీరం చల్లబడిపోయింది. వచ్చిన వ్యక్తులు ఏం చేస్తున్నారో అర్థంకాని పరిస్థితి. బంగారు నగలకు కూడా పాలిష్ చేస్తామని వారు చెప్పడంతో అంజనీబాయి నాలుగు తులాల బంగారు గాజులు తీసుకొచ్చి వారికి ఇచ్చింది. డబ్బాలో నీరు పోసి అందులో రెండు మూడు రకాల రంగులు కలిపి గ్యాస్‌స్టౌపై వేడిచేయమని చెప్పారు. వేడినీరు చల్లారిన తర్వాత గాజులు బయటకు తీయమని చెప్పి వారు వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత అంజనీబాయి డబ్బాలో చూడగా బంగారు గాజులు కనిపించలేదు. మోసం జరిగిందని ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా టికెట్ రేట్లపై ఫిర్యాదు చేయొచ్చు

చిక్కడపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సినిమా థియేటర్లలో క్యాంటిన్‌లలో ఆహార పదార్థాలు, సినిమా టికెట్ల రేట్లపై అభ్యంతరాలుంటే ప్రేక్షకులు ఫిర్యాదు చేయవచ్చని వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరావు చక్రపాణి తెలిపారు. మంగళవారం ఆయన గోల్కొండచౌరస్తాలోని మండలి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సినిమా చూసే ప్రేక్షకులు కూడా వినియోగదారుల చట్టం పరిధిలోకి వస్తారన్నారు.

వందేమాతరం గేయం వేడుకలు


వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బీజేపీ గోల్నాక డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో తులసీరాంనగర్(లంక)లోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉత్సవాలు నిర్వహించారు. నేతలు వందేమాతరం గేయం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. పార్టీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేసరి నర్సింగ్‌రావు యాదవ్, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - గోల్నాక, ఆంధ్రజ్యోతి

బార్ కౌన్సిల్ ఎన్నికల్లో

ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి

కవాడిగూడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని ఆలిండియా ఎస్సీ ఎస్టీ అడ్వొకేట్స్ ఫోరం చైర్మన్ వడ్డమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని హైకోర్టు కేంద్ర సర్కార్ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, తెలంగాణ బార్ కౌన్సిల్ ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు కనీసం ఆరు స్థానాలు కేటాయించాలన్నారు.


సోనియాగాంధీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్


ముషీరాబాద్ ఏ, బీ బ్లాక్ కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలో నిర్వహించిన సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్, పాశం అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు


ముషీరాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ జాతీయ కార్యదర్శి బిజ్జి శత్రు, శ్రావణ్‌కుమార్, గండి శ్రావణ్‌కుమార్, రాము, రాజ్‌కుమార్ తదితరులు

ఘనంగా సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకలు

(ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం)

ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకలను ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. రామమేంద్రస్వామి మఠంలో జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, నాయకులు పూజలు నిర్వహించారు.


బర్కత్‌పుర రాఘవేంద్రస్వామి మఠంలో పూజలు నిర్వహించిన జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, నాయకులు మల్లేష్, వేణుగోపాల్, ఓంప్రకాష్, రాము, రోహన్, రమేష్ తదితరులు


రాంనగర్ చౌరస్తాలో కేసీఆర్, అంబేద్కర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ శ్రేణులు


భోలక్‌పూర్‌లో ప్రభుత్వ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాసరావు ముప్పిడి నర్సింగ్‌రావు, లోకేష్ తదితరులు

కేసీఆర్ ఉద్యమంతోనే తెలంగాణ వచ్చింది

ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ఉద్యమంతోనే తెలంగాణ వచ్చిందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. దీక్షా విజయ్ దివస్‌ను పురస్కరించుకుని మంగళవారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎం. రాకేష్, నాయకులు ముఠా జైసింహ, ముఠా నరేశ్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు. గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ముడారపు రాకేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి తెలంగాణ భవన్‌లో నిర్వహించిన దీక్షా దివస్ సభకు పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లారు. మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు పున్న సత్యనారాయణ, కుమారస్వామి, ప్రభుషా, బత్తుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

కవాడిగూడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దీక్షా విజయ్ దివస్ సందర్భంగా మంగళవారం బీఆర్ఎస్ కవాడిగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ సాయికృష్ణ ఆధ్వర్యంలో దోమలగూడ పూల్‌బాగ్‌లో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దోమలగూడ గగన్‌మహల్ హెల్త్ సెంటర్‌లో మహిళా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు రాజశేఖర్‌గౌడ్, వల్లాల శ్రీనివాస్ యాదవ్, రాంచందర్, ప్రభాకర్, రవి, డాక్టర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.